
కథ

# భలే సుబ్బారావు



జి. వరలక్ష్మి

''కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే...'' అన్న శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం రేడియోలో నుంచి వస్తుంటే, సుబ్బారావు నిద్రకు భంగమయింది.

ఇంతలో సుబ్బారావు బామ్మ హడావిడిగా వచ్చి-

''ఒరేయ్ సుబ్బిగా! లేవరా! ఎప్పుడూ ఎనిమిదైతే గానీ లేవవు. అసలే, ఈ రోజు శనివారం కదట్రా! కాస్త పెందలాడే లేచి తయారవు... అలా వేంకటేశ్వరస్వామి గుడికెళ్ళొద్దాం'' గుక్క తిప్పుకోకుండా మాట్లాడిన బామ్మ మాటలకు ఉలిక్కిపడ్డాడు సుబ్బారావు.

'మంచి నిద్రపట్టే సమయంలో ఈ బామ్మొకత్తి! ఏ వారం వస్తే - ఆ వారం దేముడి గుళ్ళకు తప్పనిసరిగా తీసుకెళ్ళాల్సిందే! లేదంటే ఆ రోజంతా గొణుగుతూనే ఉంటుంది. బామ్మా! నీకు బుద్ధిలేదు' మనసులోనే తిట్టుకున్నంత పనిచేశాడు.

చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన సుబ్బారావు బామ్మ సంరక్షణలోనే పెరిగాడు.

ఇక, అక్కడ నుంచి ప్రారంభమయ్యాయండీ - మన సుబ్బారావు కష్టాలు. సుబ్బారావు కాలేజీలో జాయిన్ అయ్యేటప్పుడు-

''ఒరేయ్ సుబ్బిగా! కాలేజీలో ఆడపిల్లలు మగపిల్లలతో కలిసి సరిసమానంగా చదువుతారట కదూ! ఏ పిల్లైనా నిన్ను చూసి 'ప్రేమా- గీమా' అని వెంటబడినా, మోసపోకూడదు సుమా! సన్నాసివి, నీకవన్నీ ఏం తెలుస్తాయిరా...?'' అన్న బామ్మ మాట తీరుకు సుబ్బారావుకు వొళ్ళు మండిపోయింది.

''ఏమిటే నీ ఉద్దేశం. నా ఆలోచనలు- నా మనసు అంతా నీ ఇష్టమేనన్నమాట. ఒక 'మనిషి'గా నన్ను ఎదగనీయవా?'' అనంటూ వాళ్ళ బామ్మ మీద ఎగిరిపడ్డాడు. ''అనరా అను. మీ తాతగారున్నప్పుడు నన్ను పల్లెత్తుమాటని ఎరుగరు! ఇదంతా నా ఖర్మరా...'' ఎంతో బాధను దిగమ్రింగుకున్న దానిలా నిట్టూర్చింది. మళ్ళీ ఆవిడను ప్రసన్నం చేసుకొనేదాకా అవస్థ పడాల్సొచ్చింది సుబ్బారావుకి.

★★★

తరువాత-

కాలేజీలో ఏ అమ్మాయీ సుబ్బారావు బుద్ధావతారాన్ని చూసి ప్రేమించేయలేదు సరికదా - మన సుబ్బారావు కూడా ఏ అమ్మాయి జోలికీ వెళ్ళే సాహసం చెయ్యలేదు మరి!

ఎలాగోలా మొత్తానికి డిగ్రీ అయిందనిపించుకున్న సుబ్బారావు - వారి బంధువు ద్వారా సునాయాసంగానే క్లర్క్ పోస్టు సంపాదించుకోగలిగాడు.

★★★

''బామ్మగారూ...!'' అంటూనే ఎదురింటి సుబ్బలక్ష్మి వచ్చింది దాదాపు దూసుకొస్తున్నంతగా. సరిగా అప్పుడే లోపల గదిలో నుంచి బయటకు రాబోతున్న మన సుబ్బారావును ఢీకొడుతూ. ఆ అమ్మాయి తాకిడికి తట్టుకోలేని సుబ్బారావు ఏమి చేయాలో పాలుపోక, బిక్కమొహం వేసాడు. సుబ్బలక్ష్మి క్రీగంట అతడివంక కొంటెగా చూసింది. ఇంతలో బామ్మగారు రావటంతో-

''ఈ రోజు నా పుట్టినరోజండీ... ఈ పాయసం రుచి చూడండి. ఇక, పులిహోర, సున్నుండలు - ఇంకా మైసూర్‌పాక్ ఇవన్నీ నేనే చేసేనండీ!'' అంటూనే చటుక్కున ఆవిడకు పాదాభివందనం చేసింది. బామ్మగారు దీవించిన తరువాత అంది ''అలాగామ్మా! నిన్ను చూస్తుంటే భలే ముచ్చటేస్తుంది''

మెల్లగా లోపలకు జారుకొంటున్న సుబ్బారావు చేయి పట్టుకుని - ''మా సన్నాసీ ఉన్నాడు! వట్టి వెధవాయి. పైపెచ్చు తిక్క స్వభావం. క్రిందటిసారి వాడి పుట్టినరోజుకు ఇంట్లో నాలుగు రకాల పిండివంటలు చేస్తానులేరా అనంటే, శుభ్రంగా హోటల్‌లో పార్టీ ఇచ్చి వచ్చాడు వాడి స్నేహితులకు. పోనీలేమ్మా! అదంతా ఇప్పుడెందుకు గానీ, ఇలా వచ్చి కూర్చో తల్లీ'' అంటూ కూర్చోబెట్టింది. అప్పటికే తన చేతిని విసురుగా లాగేసుకున్న సుబ్బారావు గుర్రుగా ఆవిడ వంక చూసాడు. సుబ్బలక్ష్మికి నవ్వాగింది కాదు. కిసుక్కున నవ్వేసింది. అతగాడికి తల తీసేసినట్లనిపించింది. ఆ పిల్ల వంక చూడకూడదనుకుంటూనే అప్రయత్నంగా చూసాడు. సరిగ్గా ఆ అమ్మాయి కూడా అప్పుడే అతని వంక అలవోకగా చూడసాగింది.

సుబ్బారావు చూపులు సుబ్బలక్ష్మి మీదే నిలిచాయి.

ఆకుపచ్చ పట్టుపరికిణీ, అదేరంగు జాకెట్టు, తెల్లని సిల్కువోణీ వేసుకొని, తలనిండా పువ్వులతో, కంటికి నిండుగా కాటుక కళ్ళతో అలా సుబ్బలక్ష్మిని చూసేసరికి-

''ఒరే సుబ్బా... ఈ సున్ని ఉండవొకటి నోట్లో వేసుకుని రుచి చూడరా... మన సుబ్బలక్ష్మికి చదువంతగా లేకపోయినా - తెలివితేటలు మాత్రం అమోఘంరా! లక్షణమైన పిల్ల'' మెచ్చుకోలుగా చూసింది. క్షణకాలం తొట్రుపడిన సుబ్బారావు ఓ వెర్రినవ్వు నవ్వేసి - సున్నుండ ముక్కను నోట్లో వేసుకున్నాడు. లేదంటే, బామ్మగారు కుక్కినంత పని చేస్తుందని తెలుసు, నోట్లో పెడుతూనే!

''అమ్మాయ్ సుబ్బా...'' ఇంకా ఏదో మాట్లాడుతున్న బామ్మగారి మాటలకు మధ్యలోనే అడ్డు తగిలి ''నన్నందరూ చక్కగా 'సుబ్బలక్ష్మి' అనే పిలుస్తారండీ...'' సుబ్బారావు వేపు వెక్కిరింతగా చూస్తూ అంది. మళ్ళీ అంతలోనే ''ఆ ఇక వెళ్ళొస్తాను బామ్మగారూ! అన్నట్టు మర్చేపోయాను. ఈ రోజు గుడి కెళదామండీ...'' ఇంటి కెళ్ళడానికి ఉద్యుక్తురాలవుతూ. ఆవిడ నవ్వుతూ తలూపగానే తుర్రుమని పారిపోయింది. ఆ సాయంకాలమే సుబ్బారావు చేత స్టీలు కంచమొకటి కొనిపించి సుబ్బలక్ష్మికి కానుకగా ఇచ్చింది.

సుబ్బారావు ఆ రాత్రి వాళ్ళ బామ్మమీద గయ్‌మంటూ తారాజువ్వలా లేచాడు.

''ఇదిగో బామ్మా... లక్షణంగా నాకు 'సుబ్బారావు' అన్న చక్కటి పేరుంటే - నువ్వేంటే... నన్ను పట్టుకొని 'సుబ్బు... సుబ్బిగా...' అనంటూ పిలుస్తావ్! మళ్ళీ అలా పిలిచావంటే నేనూరుకోను... తెలుసా...ఆ...'' అనంటూ చిన్నపిల్ల వాడికి మల్లే బెదిరించసాగాడు. బామ్మగారు ముసిముసి నవ్వులు నవ్వుతూ

''ఏదో నా ముచ్చటకొద్దీ... అలా... పిలుస్తానే గానీ - నీవంటే అభిమానం లేక కాదురా. అసలీ సుబ్బారావు, అప్పారావుల పేర్లే వెర్రి వెంగళప్పులాయిల్లా గున్నాయి. ఆ పేరుకు తగ్గట్టే నువ్వూ ఉంటావ్!'' ఫుల్‌స్టాప్ లేకుండా మాట్లాడుతున్న బామ్మ మాటలకు మరింత మండిపడి ''అంటావే... అంటావ్! నీకేం, ఎన్నైనా చెబుతావ్! నీకళ్ళకెపుడూ నేనొక వెర్రి వెంగళప్పలాయిలా కనపడతానా... మంచి మంచి పొజిషన్‌లలో ఉన్నవాళ్ళకు సుబ్బారావు, అప్పారావుల పేర్లు లేవనుకున్నావా? ఏమిటీ.... పేరును బట్టి కాదు విలువ - మనిషి తాలూకు వ్యక్తిత్వాన్నిబట్టి. ఆ సుబ్బలక్ష్మి ముందే నన్నొక 'ఫూల్'ని చేసావ్... పైగా ఆ అమ్మాయి నన్నదోరకంగా చూసింది కూడా... అంతకు ముందు కొత్తలో ఎవరో నా స్నేహితులొస్తే 'రావు'న్నాడా... అని అడిగితే, రావూ లేడూ... పోవూ లేడూ... అనంటూనే 'రావేంటి నాయనా లక్షణంగా 'సుబ్బారావు' అన్న పేరుండగా! అయినా 'సుబ్బు-సుబ్బిగా' అంటూ ఇంట్లో ముద్దుగా పిలుస్తాను సుమా! అంటూ మరీ చెప్పేవట. వారి ముందు నేనెంత చిన్నబుచ్చుకొన్నానో తెలుసటే నీకు...'' స్నేహితుల ముందు జరిగిన అవమానం తలచుకోగానే విసుగు నిండిన కంఠంతో ఏకబిగిన చెప్పేసరికి, నిజంగానే బామ్మగారికి మనవడి మీద జాలేసింది.

వెనువెంటనే ఫక్కుమని నవ్వేస్తూ-

''ఓరోరి.... నీలో... ఇంకా పసితనపు ఛాయలు పోలేదురా... ఆ ఏదో పైకలా ఆకతాయి వెధవలా కనపడతావ్ గానీ... నీకేమిరా! మగమహారాజువి. ఏమిటనుకున్నావ్? నా మనవడంటే...' అంటూనే ప్రేమానురాగాలతో అక్కున చేర్చుకుంది.

మళ్ళీ సుబ్బారావులో ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్....

అదే - బామ్మ మూలాన అమాయకుడయి పోతున్నాననుకున్నాడు. కానీ,

తనలోని 'మగాడు' మేల్కొన్నప్పుడు-

ఇంకా తనలో 'పౌరుషం' తలెత్తినపుడు-

తిరిగి - మళ్ళీ బామ్మ మాటలకే రియాక్టవుతూ-

ఇలా - మళ్ళీ యథాప్రకారం షరా మామూలే-

మెల్లగా రోజులతోపాటు వారాలు

వారాలతోపాటు నెలలు గడుస్తున్నాయ్!

అప్పుడప్పుడూ సుబ్బారావు ఇంటికి వచ్చే సుబ్బలక్ష్మి రాకపోకలతోపాటు ఆమె వలపు చూపులు అతగాడి గుండెల్ని ఇంచుమించు తాకుతున్నట్టుగానే అనిపించేవి సుబ్బారావుకు.

ఒకరోజు-

బామ్మగారు సుబ్బారావుకి భోజనం వడ్డిస్తూ మెల్లగా మాటల్లోకి దింపి ''సుబ్బలక్ష్మి పై నీ అభిప్రాయం ఏమిటిరా?'' అనంటూ - ఆ అమ్మాయిని తలచుకోగానే పెదవుల మాటున చిరునవ్వు తొణికిసలాడింది. మనవడి ముఖ కవళికలు గమనిస్తున్న బామ్మగారు లోలోపలే గుంభనంగా నవ్వుకొంటూ ''మంచిరోజు చూసి వాళ్ళ నాన్నతో మాట్లాడతాను'' అంది.

ఓ మంచి ముహూర్తాన - పెద్దలందరి సమక్షంలో సుబ్బలక్ష్మి - సుబ్బారావుల పెళ్ళి వైభవంగా జరిగిపోయింది.

వాళ్ళ కాపురం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్న సమయంలో-

ఓ చిక్కువచ్చి పడిపోయింది సుబ్బలక్ష్మితోటి సుబ్బారావుకు. చిత్రం - అదేమిటంటే?

సుబ్బారావు భోజనానికి లేవటానికి ముందు సుబ్బలక్ష్మి వచ్చి ''భోజనానికి లేస్తా ....రా'' అని అన్నప్పుడు-

''ఈ మైసూర్‌పాక్ నేనే చేసేను, తిని చూడ...రా'' నోట్లో ప్రేమగా పెట్టినపుడు, బాత్‌రూమ్‌లో నీళ్ళు పెట్టి ''స్నానం చేయ....రా'' అని అడిగినపుడు - ఆఫీసుకు బయలుదేరేటపుడు అతడి వంక ఆరాధనగా చూస్తూ ''మీరొచ్చేటపుడు లైబ్రరీలో ఏమైనా పుస్తకాలు, మరేమో... పువ్వులు కూడా... తీసుకొని రారా....'' అని చెప్పినపుడు - ''ఓ సారిలా... రా... రా... ఈ కొత్తచీర నా వంటికి ఎలా ఉందో.... చెప్పరా... ఊళ్ళోకి మంచి మంచి సినిమాలు వచ్చేయని మన ప్రక్కింటి సీత చెప్పింది. తీసుకు వెళ్ళు....రా''ఇలా వగైరా... వగైరా... సందర్భానుసారంగా మాట్లాడే మాటతీరుకు మన సుబ్బారావు మనసులో భార్య సుబ్బలక్ష్మి యెడల మెల్లమెల్లగా అనుమానం చోటు చేసుకోసాగింది. సుబ్బలక్ష్మి భర్తతో ఎంత అనురాగం కనబరచినా - తీయగా కబుర్లు చెబుతున్నా - మధ్యమధ్యలో షికార్లకు బయలుదేరుతున్నా అతని మనసుకి మాత్రం ఈ 'రా...' అన్న అక్షరంతో పిలవటం ఏమిటో ఎబ్బెట్టుగా అనిపించసాగింది. అంటే, దీనినిబట్టి సుబ్బలక్ష్మి కూడా తనను అలుసుగా తీసుకొందన్నమాట! ఇదివరకైతే, బామ్మతో రిస్క్! ఆమె మాటతీరులో మాత్రం తనకు వ్యంగ్యమే కనిపించసాగింది. ఇలా పరిపరి విధాల ఆలోచిస్తున్న సుబ్బారావు వికలమైన మనసుతో అతడి హృదయం బాధగా మూలిగింది.

భర్త సరసన కూర్చుని టి.వి. చూడాలనే తలంపుతో అతడి గెడ్డాన్ని పట్టుకుని గోముగా ''టి.వి. చూద్దామా...'' అంది.

అతడు ఏం మాట్లాడకపోయేసరికి, ''ఏమిటీ... అదోలా... ఉన్నారూ?'' ప్రేమగా భుజం మీద చెయ్యేసి అభిమానంగా అడగసాగింది.

'ఎంత ఎగతాళిగా అడుగుతుంది' వొళ్ళు మండిపోసాగింది సుబ్బారావుకు. 'పోనీ, ఈ రోజుల్లో భార్యాభర్తలిరువురూ ఏకవచనంతో సంబోధించుకోవటం పరిపాటే అయినా, తనకు మాత్రం సుబ్బలక్ష్మిలో వెటకారమే కనిపిస్తుంది. అతని అంతరంగం అంతుపట్టని సమస్యతో సతమతమవుతున్న తరుణంలో సుబ్బలక్ష్మి చేతి కుదుపుతో వాస్తవంలోకి వచ్చిన సుబ్బారావు తత్తరపడుతూ ''అబ్బే... మరేం లేదు'' అనంటూనే అప్రయత్నంగా ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

ఏ రోజుకారోజు సుబ్బారావులో నిరాశ చోటు చేసుకోసాగింది. బామ్మతో చెప్పినా - తేలిగ్గా కొట్టి పారేస్తుందనుకున్నాడు.

★★★

ఈ మధ్య సుబ్బారావు వాలకాన్ని గమనిస్తున్న అతడికి కాస్త సన్నిహితుడయిన రామారావనే క్లర్కు ఆఫీసు అయింతర్వాత చనువుతో కూడిన అభిమానంతో ''ఏమిటోయ్ సుబ్బారావ్! రోజూ అదోలా ఉంటున్నావ్?'' అనంటూ పట్టుబట్టి అడగడంతో సుబ్బారావు కంటికి రామారావు ఆపద్బాంధవుడిలా అనిపించసాగాడు. ఒక నిశ్చయానికి వచ్చినవాడిలా తన మనసులోని విషయాన్ని అతని ముందుంచాడు. అంతా విన్న అతడు ఒక్క క్షణం అప్రభుతుడయ్యాడు. మరుక్షణం తేరుకొని,

''ఓహ్! భలే వాడివయ్యా... సుబ్బారావ్ ఏదో జటిల సమస్యనుకొని అదుర్దా పడిపోయేను. ఛ... ఛ... మా చెల్లెమ్మకు నీవంటే గౌరవ భావమే కానీ, మరోటి కాదు. అయినా, అసలిలాంటి ఆలోచన ఎందుకొచ్చింది? సంసారం అన్న తరువాత భార్యా భర్తలిరువురికీ ఏవో బేధాభిప్రాయాలైతే ఉండొచ్చుయేమో గానీ - మనం నిత్యం మాట్లాడుకునే వాడుక భాషకే వేరే అర్థాల్ని తీస్తే ఎలా? నీ భార్యతో ఎప్పుడైనా సంప్రదించేవా? నీలో నువ్వు ఏదేదో ఊహించేసుకుని - మానసికంగా చాలా వర్రీ అయ్యావనిపిస్తుంది. జీవితమనే భవిష్యత్తులో మనం ముందు ముందు పైకి రావలసినవాళ్ళం. అటువంటిది, మన సెంటిమెంట్లతో మన అవివేకపు ఆలోచనలతో జీవితాన్ని అంధకారం చేసుకోకూడదు. జీవితం సుఖమయం చేసుకోవాలి!'' అనంటూ తనకున్న ప్రతిభతో కొన్ని ఉపమానాలతో 'ఇదీ సంగతి!' అంటూ సుబ్బారావుకు నచ్చజెప్పిన రామారావుకు తలప్రాణం తోకకి వచ్చినట్లయింది.

ఇకనేం-

మన సుబ్బారావు సమస్య విడిపోయినట్టే కదా!

★★★

ఆదరాబాదరాగా ఇంటికొచ్చిన సుబ్బారావు రాకను చూసి కంగారు పడిపోసాగింది సుబ్బలక్ష్మి. దూదిపింజలా ఎగిరిపోయిన అతడి మనసు పరవశంగా - సంతోషంగా ఆర్తిగా ఆమె శరీరాన్ని సుబ్బారావు చేతులు చుట్టేశాయి. మెల్లగా తనలోని అనుమానాన్ని ఆమె ముందు బహిర్గతం చేసాడు. ఒక్కసారిగా అచేతనురాలయిపోయిన సుబ్బలక్ష్మి వెంటనే కిలకిలమని నవ్వేస్తూ-

''నేనేదో 'సరిగమపదనిసా!' అన్నట్టు మిమ్మల్నేదో గారాలు పోతూ ముద్దుగా మాట్లాడేదాన్ని. ఎవరైనా ఏకవచనంతో పిలిచేటప్పుడు 'ఇది చేస్తావురా... అది ఇస్తావటరా' అనంటూ ఆ రకంగా మాట్లాడుతుంటారు కొందరు. మీరేమిటండీ... చదువుకొని... అలా ఆలోచిస్తారనుకోలేదు. స్కూల్లో మీ మాస్టారుగారు 'వు' అన్న అక్షరాన్ని ఉపయోగించేవారు కాదా...? అభిమానం - అనురాగం - ప్రేమ కలయికతో మొగుణ్ని చూసుకొనే ఏ పెళ్ళామైనా ఎలా పిలిచినా అది అతడికి మురిపెంగానే ఉండాలి గానీ...'' అంటూ భర్త వంక చూసింది. అతడు దాదాపు మూగవాడే అయ్యాడు.

''నేను ఇన్ని మాటలు మాట్లాడుతున్నాను కదా! నా మీద... కోపమా... మాట్లా... డ...రా'' గారాలు పోతూ మాట్లాడుతున్న భార్యను దగ్గరకు తీసుకొని ముద్దుపెట్టుకొన్నాడు.

అప్పటికే వారి సంభాషణను - వరండాలో కూర్చొని వత్తులు చేసుకొంటున్న బామ్మగారు విని,

''ఓరో... రి... సుబ్బిగా!'' అంటూనే పగలబడి నవ్వటంతో సిగ్గుపడిపోయిన సుబ్బారావు భార్య సుబ్బలక్ష్మి మెడ వంపులో తన్మయంగా తలదూర్చాడు.